క్లుప్తంగా

నేటి నుంచి 10,14వ వార్డుల్లో 'కంటి వెలుగు'

జనగామ: జనగామ పట్టణంలోని 10, 14వ వార్డు పరిధిలో నేటి (శుక్రవారం) నుంచి కంటి వెలుగు శిబిరం ప్రారంభించడం జరుగుతుందని వైద్యాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ వార్డు అంబేడ్కర్ నగర్ కమ్యూనిటీ హాల్, 10వ వార్డు మున్సిపల్ కమ్యూనిటీ హాల్ (ఏబీవీ స్కూల్ ఆవరణ) శని, ఆదివారం మినహాయిస్తే ఐదు రోజుల పాటు అందుబాటులో ఉండే కంటి వెలుగు వైద్య శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేసు నమోదు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని మీదికొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు రామ్మూర్తిపై పోక్సో కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ఏడీ రమేష్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో వారు మాట్లాడారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే అసభ్యకరంగా మాట్లాడడం, బెదిరింపులకు పాల్పడం సరికాదన్నారు. నాయకులు రవి తదితరులు ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



రాజు (ఫైల్)

జనగామ రూరల్: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని శామీర్‌పేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మండలంలోని శామీర్‌పేటలో మోదెపు రాజు(42) వృత్తిలో భాగంగా గురువారం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు.

భూమి పూజకు తరలిరావాలి

కొడకండ్ల : ఈ నెల 26న పాలకుర్తి మండలకేంద్రంలో సద్గురు సేవాలాల్ మహరాజ్, మేరామ యాడి ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారు అభిమన్‌గాంధీ నాయక్ తెలిపారు. రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరవుతారని, గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

పాలకుర్తి: ఏపీజీవీబీ బ్యాంకు సేవలపై వినియోగదారులు ఆర్థిక అవగాహన పెంచుకోవాలని బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు పెద్దూరు స్రవంతి, బొక్క విజయభాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని బమ్మెరలో వినియోగదారులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కడప నుంచి వచ్చిన కళాకారులు నగదు రహిత సేవలు, బీమా సదుపాయం తదితర అంశాలపై అవగాహనపై కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఏజెంట్ శ్రీను, రాపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జనగామ రూరల్: పట్టణానికి చెందిన ఉడుగుల రాంనర్సమ్మ జ్ఞాపకార్థం కుమారుడు నర్సింహులు గురువారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యాన స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నిలువ నీడ లేని నిరాశ్రయులకు అన్నదానం చేశారు. కుటుంబ సభ్యుడు యాదగిరి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి, బీమ్‌రాజ్, కార్తీక్, సుధాకర్, మదన్ లఖన్ సింగ్ పాల్గొన్నారు.

యూటర్న్.. ప్రమాదకరం

- క్రాసింగ్ వద్ద ఏపుగా పెరిగిన మొక్కలు
- వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు



నెల్లుట్ల నుంచి లింగాలఘణపురం క్రాస్ వద్ద డివైడర్‌పై ప్రమాదకరంగా ఉన్న మొక్కలు

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట జాతీయ రహదారిపై నెల్లుట్ల వద్ద లింగాలఘణపురం యూ–టర్న్ వద్ద డివైజర్‌పై ఉన్న మొక్కలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. డివైడర్‌పై ఉన్న మొక్కలతో సూర్యాపేట వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా లింగాలఘణపురం వైపు క్రాస్ అయ్యే ప్రయాణికులకు అడ్డంగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి కావడంతో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అదే చోట ఇప్పటి వరకు సుమారుగా 20కిపైగా ప్రమాదాలు జరిగి అనేక మందికి గాయాలు కాగా పలువురు మృత్యువాత పడ్డారు. ఈ నెల 21న నెల్లుట్లకు చెందిన చింత శ్రీనివాసు అనే యువకుడు రోడ్డు దాటుతుండగా టాటాఏస్ వాహనం ఢీకొట్టి తీవ్ర గాయాలతో చికిత్సపొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు. డివైడర్‌పై ప్రమాదకరంగా ఉన్న మొక్కలు సూర్యాపేట వైపు నుంచి వచ్చే వాహనదారులకు లింగాలఘణపురం వైపు క్రాస్ అయ్యే ప్రయాణికులు, వాహనాలు కనిపించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు బారీకేడ్లు ఏర్పాటు చేసినా ప్రమాదాలు మాత్రం తప్పడంలేదు. గ్రామాల్లో అనేక ప్రమాదాలు ఇక్కడే జరుగుతుండడంతో ఆ మొక్కలను కొంతమేర తొలగించాలని ఈ నెల 22న జిల్లా కలెక్టర్ శివలింగయ్య నెల్లుట్ల గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

కొద్దిమేర తొలగించాలి..

నెల్లుట్ల వద్ద డివైడర్‌పై ఏపుగా పెరిగిన మొక్కలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో సూర్యాపేట వైపు నుంచి జనగామ వచ్చే వాహనాలు క్రాసింగ్ వద్ద కనిపించడంలేదు. ఎక్కువ ప్రమాదాలు అక్కడే జరుగుతున్నాయి. కొద్ది దూరం ఆ మొక్కలను తొలగించి ప్రమాదాలు జరుగకుండా చూడాలి.

–నల్ల బాబురావు, నెల్లుట్ల

'సఖి' సేవలపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న రంజిత్‌కుమార్

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారంలో గ్రామపంచాయతీ నూతన భవనంలో గురువారం సఖీ కేంద్రం అందిస్తున్న న్యాయసేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ అధికారి రంజిత్‌కుమార్, సఖీ కేంద్రం ప్రతినిధి పవిత్ర మహిళా సంరక్షణ చట్టాలు, బాల కార్మిక నిరోధక చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఇరుమల్ల బాలమణి, ఎంపీటీసీ భూక్యా జుంలాల్ నాయక్, ఉపసర్పంచ్ అనంతారం సుధాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, తాటి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నూతన సాగు విధానం చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వినయ్

చిల్పూరు: కూలీల కొరత నివారణకు రైతులు నూతన సాగు విధానం చేపట్టాలని అగ్రికాపిటా సమస్త సూపర్‌వైజర్ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలో కృష్ణాజీగూడెంలో గురువారం డ్రోన్ సాయంతో మందు పిచికారీ చేసే విధానంతో పాటు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సంస్థలో పేర్లు నమోదు చేసుకున్న సాదం ఆంజనేయులు, వడ్లకొండ యాదగిరి వరి పంటలపై డ్రోన్ సాయంతో క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో జంగిడి రేణుకతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న వెంకట్రాజం

జనగామ రూరల్: కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి వెంకట్రాజం అన్నారు. గురువారం ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందని విమర్శించారు. ఎరువుల సబ్సిడీలు కుదించడం వల్ల ఆహార భద్రతకు ముప్పు వాటిల్లిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు నిధుల్లో కోత విధించడం దారుణమన్నారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో మార్చి 1వ తేదీన విజయ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లుని తెలిపారు. నాయకులు బొట్ల శ్రీనివాస్, రాపర్తి రాజు, సోమయ్య, చందు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



చిల్పూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్ అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో గురువారం శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ఊరడి రాజు ఆధ్వర్యంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, పడుతున్న గోసలు ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి పార్టీ ఆధ్వర్యంలో భరోసా కల్పించేందుకు సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుగులోతు మధు, సాదం కొత్తగొల్ల భీమయ్య, జక్కుల లింగయ్య, నాగరాజు, పోలు రమేష్, బల్లె రామరాజు, పన్నీరు అశోక్, గొల్లపల్లి వాసు, తోట శ్రీను, గాలి రాజు ఉన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కొడకండ్ల: వైద్య విద్యార్థి, గిరిజన ముద్దుబిడ్డ ధరావత్ ప్రీతిని మానసికంగా హింసించిన దోషులను కఠినంగా శిక్షించాలని గిరిజన సమన్వయ కమిటీ నాయకుడు ధరావత్ వీరన్ననాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు సేవ చేయాలనే మహోన్నత లక్ష్యంతో కష్టపడి చదువుకొని జూనియర్‌గా సేవలందిస్తున్న తరుణంలో సీనియర్ మానసిక హింసలకు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసుకోవడం విచారకరమని అన్నారు. సీనియర్‌పై ఫిర్యాదు చేసినా కూడా ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలు అతనిపై చర్య తీసుకోకపోవడం వల్లనే గిరిజన బిడ్డకు ఈ దుస్థితి దాపురించిందని, ప్రీతికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన బిడ్డ ఈ అఘాయిత్యానికి పాల్పడేందుకు కారకులైన సీనియర్‌తో పాటు ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలపై చర్య తీసుకోవాలని వీరన్ననాయక్ డిమాండ్ చేశారు.

సన్మానం



జనగామ రూరల్: ఇటీవల కురుమ సంఘం యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అలేటి రాజు నియామకమయ్యాడు. కాగా, గురువారం జిల్లా కురుమ సంఘం యూత్ కమిటీ ఆధ్వర్యంలో రాజును శాలువాతో సన్మానించారు. మహేష్, భాస్కర్ , శ్రీనివాస్, హరీష్, వినయ్ ఉన్నారు

సంజీవరెడ్డికి అభినందనలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఢిల్లీలో జరిగిన 33వ ప్లీనరీ సెషన్‌లో, జనరల్ కౌన్సిల్‌లో ఆల్ ఇండియా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంజీవరెడ్డిని ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు ఐలేష్, గంగాధర్ ఉన్నారు.

లారీ, ట్రాక్టర్ ఢీ..

- ఇరువురు డ్రైవర్లకు గాయాలు



ఘటన స్థలంలో పల్టీకొట్టిన ట్రాక్టర్, మెట్లను ఢీకొట్టిన లారీ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో గురువారం తెల్లవారు జామున లారీ, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఇరువురు డ్రైవర్లకు గాయాలయ్యాయి. దేవరుప్పల నుంచి పాలకుర్తి వస్తున్న ట్రాక్టర్, భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఎదురెదురుగా రాజీవ్ చౌరస్తాలో ఢీకొనడంతో లారీ ఎదురుగా ఉన్న షాపు మెట్లను తగిలి డ్రైవర్ భూక్యా హేమ్లా క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రాక్టర్ పల్టీలు కొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ భూక్యా సురేందర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం తొర్రూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ భూక్యా హేమ్లా నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు. అభివృద్ధి సుందరీకరణలో భాగంగా పాలకుర్తి రాజీవ్ చౌరస్తా నుంచి రోడ్డు వెడల్పు చేపట్టగా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అతివేగంతో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే అధికారులు స్పందించి రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పీఏసీఎస్ సమావేశం వాయిదా

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం సొసైటీ కార్యాలయంలో చైర్మన్ చీమలపాటి రవీందర్‌జి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు కాగా సొసైటీకి సంబంధించిన లావాదేవీల వివరాలు చూపాలని డైరెక్టర్లు డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన వివరాలు అందుబాటులో లేవని త్వరలో ఏర్పాటు చేసే పూర్తి వివరాలు అందజేస్తామని చైర్మన్ సభను వాయిదా వేశారు. సమావేశంలో సొసైటీ సీఈఓ వంగ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్లు అయిత జయరాములు, కావటి భాస్కర్, జిట్టె వీరస్వామి, గూడెల్లి మహేష్, మూడ్ ధర్మా, ఇల్లందుల రవి, దామెదర్‌రెడ్డి, బొల్లపల్లి సౌందర్య, మేడిపల్లి వెంకటేశ్వర్లు, పసుల ఏలియా, గొరిగె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చిల్పూరు: శ్రీపతిపల్లికి చెందిన రొడ్డ లత అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు ఆమె కుమారుడు ఇమ్మానియేల్ బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మండల అధ్యక్షుడు సురేష్, దుర్గాప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ ఊమ్లా నాయక్, రజని, బాలరాజు, నాగన్న, రాజయ్య, ఎల్లయ్య ఉన్నారు.

జాలుబాయితండాలో..



తరిగొప్పుల: మండలంలోని జాలుబాయితండాకు చెందిన సభావత్ వినోద అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కాగా, శ్రీ సంత్ సేవాలాల్ సమితి సభ్యులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



బచ్చన్నపేట: కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత



జనగామ రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీలత

జనగామ రూరల్: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సర్పంచ్ జి.శ్రీలత అన్నారు. మండలంలోని పెద్దపహాడ్‌లో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పట్టణంలోని 13 వార్డులో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి అయిన సందర్భంగా సిబ్బందికి కౌన్సిలర్ మల్లిగారి చంద్ర కళ చీరలు అందజేసి సత్కరించారు. డాక్టర్ ప్రవీణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హిమ్మత్‌నగర్‌లో కంటి వెలుగు ప్రారంభం



జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్‌లో..సర్పంచ్ అశోక్

జఫర్‌గఢ్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా మండలంలోని హిమ్మత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ తాటికాయల అశోక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరు కంటి సమస్యతో బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి, డాక్టర్ జయప్రకాశ్‌గౌడ్, శరత్, రజని, సరోజన, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కట్కూర్‌లో..

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని మండలంలోని కట్కూర్ గ్రామ సర్పంచ్ మూసిని సునీత అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపు సమస్య ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచిత అద్దాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఉప సర్పంచ్ ఓరుగంటి శ్రీనివాస్, నాయకులు బావండ్ల కృష్ణంరాజు, మూసిని రాజు, శ్రీశైలం, విదేయ్‌కుమార్, కెంగర్ల రవి, భానుచందర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఆచార్య, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలు



జఫర్‌గఢ్ తిమ్మంపేటలో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: నియోజకవర్గంలోని మహిళా పొదుపు సంఘాలకు రూ. 100 కోట్లతో వడ్డీ లేకుండా రుణాలు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. మండలంలోని రఘునాథ్‌పల్లి, తిడుగు, దుర్గ్యా నాయక్‌తండా, తిమ్మంపేట, జఫర్‌గఢ్, మగ్దుంతండా, తమ్మడపల్లి (జి), హిమ్మత్‌నగర్, తీగారంలో ఈజీఎస్ నిధులతో పెద్ద ఎత్తున చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు గ్రామ పంచాయతీ నూతన భవనాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాజయ్య గురువారం శంకుస్థాపనలు చేశారు. తొలుత రఘునాథ్‌పల్లిలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మహిళా పొదుపు సంఘాలకు రుణాలు ఇచ్చే విషయంలో సీఎం కేసీఆర్‌తో మాట్లాడడం జరిగిందన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.100 కోట్ల రుణాలను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, సర్పంచ్‌లు శ్రీదేవి, మల్లేశం, నర్సింగరావు, అశోక్, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, స్రవంతి, వెంకటస్వామి, శివయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఉన్నారు.

పరామర్శ

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కోల పరుశరాములు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

సేవాభావంతో వైద్య సేవలందించాలి

రఘునాథపల్లి: సేవా భావంతో వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రీ ఆధ్య డెంటల్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొల్లం అజయ్, రవిగౌడ్, నరేందర్, విజయ్, కొమురెల్లి పాల్గొన్నారు.

'దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు'

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను అదాని, అంబానిలకు కట్టబెడుతున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపుర ఇందిర అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేలా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ప్రధాని మోదీ తన స్నేహితులకు దేశ ఖజానా దోచిపెడుతున్నారని, అదాని కుంభకోణంపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. అవినీతిపై సీబీఐ, ఎస్‌బీ సంస్థల ద్వారా విచారణ జరిపించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు చింత ఎల్లయ్య, కోరుకొప్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మోహనాచారి

చిల్పూరు: ఈనెల 26 నుంచి మార్చి 5వ తేదీ వరకు మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రచార రథాన్ని ఆలయ శాశ్వత దాత, మాజీ ధర్మకర్త సంగోజు మోహనాచారి ప్రారంభించారు. ఉదయం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఇన్‌చార్జ్ ఈఓ నెక్కంటి వెంకట్రావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంచాల సంపత్‌రాజు, జంగిటి కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, వేల్పుల గట్టయ్య, వీరన్న, మహేష్, మల్లికార్జున్, కృష్ణ ఉన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

బచ్చన్నపేట: మండలంలోని దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు గొట్టె కనకయ్య, రఘుమూర్తి, ప్రవీణ్, రజిత, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.